ఆఫీస్‌లో ఓ అరగంట పర్మిషన్ తీసుకుని లగేజ్‌తో ఆటోలో బయలుదేరి సరిగ్గా అయిదున్నరకల్లా సికింద్రాబాద్ స్టేషన్‌లో కాలుమోపాను. స్టేషన్ అంతా కోలాహలంగా ఉంది ఎప్పటిలానే! అప్పుడే వస్తోన్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌ని చూడగానే ఏదో ఆత్మీయత నాలో కదలాడింది.

నా కోచ్ నంబరు చూసుకుని ఎక్కి లగేజి సర్దుకున్నాను. నా లగేజి ఎక్కువే ఉంది. కారణం నాకు ఉద్యోగం వచ్చాక మొదటిసారిగా మావూరికి వెళుతున్నాను జాయినయిన రెండు నెలలకు! అమ్మానాన్న, తమ్ముళ్ళ మధ్య రేపు ఉదయానికల్లా ఉంటాననే ఆలోచనే నన్ను ఆనందంలో ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. వాళ్ళను వదిలి ఇన్నిరోజులు ఎప్పుడూ ఉండలేదు. అసలీ రోజు కోసమే ఎదురుచూస్తున్నాను.



ఆరోజు.. స్టాఫ్ సెలక్షన్ కమీషన్ పరీక్ష పాసయిన నాకు హైదరాబాదులోని ఓ సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీస్ నుండి అప్పాయింట్‌మెంట్ ఆర్డరు వచ్చింది. అప్పటికే మూడేళ్ళ నుండీ ఉద్యోగం కోసం తపస్సు చేసుకుంటూ యోగినైన.. నిరుద్యోగినైన నాలో ఒక్కసారిగా సంతోషం ఉప్పెనలా పెల్లుబికింది. అమ్మానాన్నలు ఎంతో పొంగిపోయారు. ఉన్న రెండెకరాల పొలంలోనూ సగం నాకే ఆహుతి అయిపోయింది. నాన్న నాకోసమే అహర్నిశలు శ్రమిస్తోన్న శ్రమజీవి.

పిల్లలు పుట్టాక వాళ్ళకోసమే జీవితం అంకితం అనే దంపతులు అమ్మానాన్నలు. నేను వాళ్ళచాటు బిడ్డగానే పెరిగాను. నేను ఉద్యోగానికి బయలుదేరే రోజు వచ్చింది. మిమ్మల్ని వదలి నేను ఉండలేనని.. ఏడ్చేశాను. అమ్మనాన్నలు సర్దిచెప్పారు. నువ్వు పెద్దవాడివి అవుతున్నావు. ధైర్యంగా ఉండాలి అనేవారు.

జాబ్‌లో చేరాక నెమ్మదిగా.. ఇంటి వాతావరణాన్ని కొంత మర్చిపోగలిగినా.. ఉత్తరాలు రాస్తున్నప్పుడు సంగతులు బరువే అయి మనసు పొరలనిండా దూరంగా ఉన్న నా వాళ్ళను గురించిన ఆలోచనలే. వాళ్ళు గుర్తొచ్చినప్పుడల్లా నా కళ్ళనిండా నీళ్ళే. ఇంకొంచెం బాధపడే విషయం ఏమిటంటే.. నాది బదిలీలు లేని ఉద్యోగం.

అమ్మానాన్నలు నేను వస్తున్నానని ఏం హడావుడి. ఎంత హైరానా పడిపోతున్నారో.. తమ్ముళ్ళు ఎలా ఉన్నారో.. ఆ రాత్రి ట్రైన్‌లో సరిగ్గా నిద్రపట్టలేదు.

# మమకారం

**- జి.యన్.వి.సత్యనారాయణ**

పదిరోజులు.. పట్టుమని గడిచిపోయాయి.


మరలా హైదరాబాద్‌లో ఆఫీస్ వర్కులో వచ్చిపడ్డాను.

• • •

పోస్ట్‌లో ఆరోజు వచ్చిన ఉత్తరం నాలో అంతులేని ఆనందాన్ని కారణం అమ్మానాన్న తమ్ముళ్ళు హైదరాబాదు వస్తున్నారు. ఆఫీస్‌లో నా అందరికీ చెప్పేశాను. నా రూమ్ అంతా డెకరేట్ చేసేశాను. అమ్మానాన్నలకు

వంట్లో కష్టం కలగకూడదు. అన్ని సరకులూ తెచ్చాను. ఇంకా ఏమేం కావాలో లిస్ట్ రాసుకున్నాను. ఆఫీసులో లోనుకప్లై చేశాను.

అమ్మా నాన్నలు రానే వచ్చారు. నా మనసు పొరల్లో దాగిన ఒంటరితనమేదో ఎగిరిపోయినట్లుగా ఉంది. వాళ్ళ అవసరాలన్నీ దగ్గరుండి నేనే చూసుకున్నాను. హైదరాబాదులో చూడదగ్గవన్నీ చూపించాను. వీళ్ళు నాదగ్గరే ఉండిపోతే ఎంత బాగుణ్ను.. అనిపిస్తోంది.



నా రూమ్ స్వరూపమే మారిపోయింది. చాలా వస్తువులు వచ్చిచేరాయి. అమ్మానాన్నలు వచ్చిన సంతోషఛాయ మెరుపును నాలో స్పష్టంగా చూసిన నా కొలీగ్స్.. కామెంట్స్ చేయకపోలేదు.

పొలం పనులున్నాయని నాన్న తొందర చేయడంతో.. పదిహేను రోజులకే తిరిగి ప్రయాణం కట్టారు నేను ఎంత వారించినా. రేపే వాళ్ళ ప్రయాణమనగా.. నేను డల్ అయిపోయాను. నీరసం.. నిస్సత్తువ నన్నావహించాయి. అన్నం తినబుద్ధి కాలేదు. ఆఫీసుకు సెలవు పెట్టేశాను.

స్టేషనుకు చేరుకున్నాము.

గుండెల్లోంచి బాధ ఎగదన్నుకు వస్తోంది. ఏడుపొక్కటే తరువాయి. వాళ్ళ పరిస్థితీ అలానే ఉంది. నన్ను అనునయిస్తున్నారు. నా ఆరోగ్యం కోసం అమ్మ ఏవో జాగ్రత్తలు చెబ్తూనే ఉంది.

''అమ్మా.. నాన్నా.. ఉంటాను. తమ్ముళ్ళూ.. చదువుకోండి బాగా..'' గొంతు జీరబోయింది.

టాటా చెప్తూన్నారు. కొంతమంది వింతగా చూస్తున్నా.. కనుమరుగయేంత వరకూ.. పరిగెడుతూ.. చేయి ఊపుతూ.. ప్లాట్‌ఫారం చివరకు వచ్చేసాను. ఇక నువ్వు నన్నందుకోలేవులే.. అంటూ గోదావరి గర్వంగా దాటి వెళ్ళిపోయింది.

అంతవరకూ.. ఉగ్గపట్టిన బాధ కన్నీరు రూపంలో ఒక్కసారిగా బయటపడింది. ఆ చివరి ప్లాట్‌ఫారం బెంచీ మీద కూర్చొని.. రెండు నిముషాలు ఏడ్చేశాను. కొందరు నావైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

మనసు బరువుతో తిరిగి రూమ్‌కి చేరుకున్నాను. బోసిపోయిన నాగది.. మరింత భారాన్ని కలబోసింది.

కాలం.. మరో మూడేళ్ళను తనలో ఇముడ్చుకుంది. నా జీవితంలో కొన్ని మార్పులూ తెచ్చింది. పెళ్ళయింది. ఆఫీసులో ప్రమోషన్ వచ్చింది.

పాప కూడా పుట్టింది. పాపకు సంవత్సరం నిండబోతుంది. పాప పుట్టిన రోజుకి తప్పకుండా రావాలని.. అమ్మానాన్నలకు లెటర్ రాశాను.

ఈ మూడేళ్ళలో వాళ్ళు మళ్ళీ ఇక్కడకు రానేలేదు. ఏవో పనుల ఇబ్బందులు.. అవసరాలవలన.. మేమే తిరిగాము.

పాప పుట్టినరోజు చాలా గ్రాండ్‌గా చేశాము. మా పాప తన నానమ్మ.. తాతలకు బాగా చేరికయిపోయింది. పదిరోజులు ఇట్టే గడచిపోయాయి.

మా అమ్మ తన మనవరాల్ని వదలి ఉండలేకపోతోంది. ''మీ ఆరోగ్యాలు పాడయిపోతున్నాయి. పాపతో మీరు ఏం యాతన పడతారు. ఓ రెండు మూడు నెలలు మాదగ్గర ఉంటుంది. మేము తీసుకెళతాం'' అన్నారు అమ్మానాన్నలు.

సరే అనక తప్పిందికాదు.

స్టేషన్‌లో నా భార్య ఏడుపు. ''ఏవండీ నేను దాన్ని వదలి ఎప్పుడూ ఉండలేదండి. నేను ఉండలేనండీ.''

నా పరిస్థితీ అలానే ఉంది. అమాయకంగా ముఖం పెట్టి.. జాలిగా చూస్తోంది.

దానికీ డౌటు వచ్చేసినట్టుంది. అప్పటివరకూ అందరం ఊరికి వెళుతున్నామని చెప్పాం. నా భార్య దాని చేతులు పట్టుకుని వదలడంలేదు.

గోదావరి కదిలింది.. ఈ సన్నివేశాలన్నీ నాకు మామూలే అన్నట్లు.

మేము రావడం లేదని.. మాపాపకు రూఢీగా తెలిసిపోయింది.

అంతే-

ఇక ఏడుపు లంకించుకుంది.

కోచ్‌తోపాటు కొంతదూరం పరుగెత్తాము.

''ఏమండీ.. పాప..''

నా భార్యకు దుఃఖం ఆగడంలేదు.

''పాపని మనం వదలి ఉండలేము. రెండురోజులు పోయాక.. వెళ్ళి తెచ్చేసుకుందాం'' బాధనిండిన స్వరంతో చెప్పాను.

ఇద్దరం దిగులుగా స్టేషన్ బయటకు వచ్చాము.

స్కూటర్ స్టాండ్‌లో స్కూటర్ తీస్తున్నప్పుడు.. నా మదిలో.. అప్పుడు.. అప్పుడు.. అనిపించింది.

పాప.. నా పాప వెళ్ళిపోతుందనే.. బాధపడ్డాను. బాధపడుతున్నాను ఎక్కువగా!

అసలు..

అమ్మా.. నాన్న.. తమ్ముళ్ళు కూడా వెళ్ళిపోతున్నారే.. అని తలంపే రాలేదు నా మనసుకు.. ఇప్పుడు.

చిత్రంగా ఉంది. కాసేపు అలానే ఉండిపోయాను.

నా స్థితి నాకే వింతగానూ ఉంది. విచిత్రంగానూ ఉంది.

★